**237వ అధ్యాయం**

# ٢٣٧ ـ بَـابُ فَضْـلِ الإِحْسَـانِ إِلَـى المَمْلوكِ

## బానిసల పట్ల సద్వ్యవహారం

قَالَ الله تَعَالى: ﴿ وَٱعْبُدُوا ٱللَّهَ وَلَا تُشْرِكُوا بِهِۦ شَيْـًٔا وَبِٱلْوَٰلِدَيْنِ إِحْسَٰنًا وَبِذِى ٱلْقُرْبَىٰ وَٱلْيَتَٰمَىٰ وَٱلْمَسَٰكِينِ وَٱلْجَارِ ذِى ٱلْقُرْبَىٰ وَٱلْجَارِ ٱلْجُنُبِ وَٱلصَّاحِبِ بِٱلْجَنۢبِ وَٱبْنِ ٱلسَّبِيلِ وَمَا مَلَكَتْ أَيْمَٰنُكُمْ﴾ [النساء: ٣٦].

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"అల్లాహ్‌కు దాస్యం చెయ్యండి. ఎవరినీ ఆయనకు భాగస్వాములు చేయవద్దు. తల్లిదండ్రుల యెడల సద్భావంతో మెలగండి. బంధువులూ, అనాథులూ నిరుపేదల పట్ల మంచిగా వ్యవహరించండి. పొరుగున ఉన్న బంధువులు, అపరిచితులయిన పొరుగువారు, ప్రక్కనున్న మిత్రులు, బాటసారులు, మీ అధీనంలో ఉన్న దాసదాసీజనం పట్ల ఉదార బుద్ధితో వ్యవహరించండి." *(నిసా: 36)*

١٣٦١ ـ وَعَنِ المَعْرُورِ بنِ سُوَيْدٍ قَالَ: رَأَيْتُ أَبَا ذَرٍّ، رَضِيَ اللهُ عَنْهُ، وعليهِ حُلَّةٌ، وَعَلى غُلامِهِ مِثْلُهَا، فَسَأَلْتُهُ عَنْ ذلكَ، فَذَكَرَ أَنَّهُ سَابَّ رَجُلاً عَلى عَهْدِ رَسُولِ اللهِ ﷺ، فَعَيَّرَهُ بِأُمِّهِ، فَقَالَ النَّبِيُّ ﷺ: «إِنَّكَ امْرُؤٌ فِيكَ جَاهِلِيَّةٌ هُمْ

1361. హజ్రత్ మారూర్ బిన్ సువైద్ (రజి) ఇలా తెలియజేశారు: నేనొకసారి అబూ జర్ర్ (రజి)గార్ని చూశాను. ఆ సమయంలో ఆయన, ఆయన బానిస ఇద్దరూ ఒకేరకమైన దుస్తులు ధరించి ఉన్నారు. నేను (మీ బానిసకు కూడా అలాంటి బట్టలే ఎందుకు తొడిగించారని) అడిగాను. అందుకాయన సమాధానమిస్తూ ఈ విధంగా వివరించారు.

"దైవప్రవక్త (సల్లం) కాలంలో నేనో (బానిస) వ్యక్తిని తిట్టాను. అతని తల్లిని గురించి ప్రస్తావించి ఎత్తిపొడిచాను. (ఎలాగో ఈ విషయం దైవప్రవక్త

إخوانكم، وخولكم جعلهم الله تحت أيديكم، فمن كان أخوه تحت يده؛ فليطعمه مما يأكل، وليلبسه مما يلبس، ولا تكلفوهم ما يغلبهم، فإن كلفتموهم فأعينوهم». متفق عليه.

(సల్లం)కు తెలిసింది) అప్పుడాయన (నన్ను మందలిస్తూ) ఇలా అన్నారు:

"అబూ జర్ర్! నీలో ఇంకా ఆ అజ్ఞానం పోలేదయ్యా. (అసలు మీరు బానిసల్ని గురించి ఏమనుకుంటున్నారు?) వారు మీ సోదరుల్లాంటి వారు. దేవుడు వారిని మీ అధీనంలో ఉంచాడు. వారు మీకు సేవ చేస్తున్నారు. కనుక తమ అధీనంలో ఉండే సోదరులకు తాము తినేటటు వంటి తిండే పెట్టాలి. తాము తొడిగేటటువంటి బట్టలే వారికీ తొడిగించాలి. మీరు మోయలేని భారాన్ని వారిపై మోపకండి. ఒకవేళ (అవసరం వల్ల) మోపినా మీరు కూడా వారికి సహాయపడండి."

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని బానిస విమోచన ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ప్రమాణాల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

తమ అధీనంలో ఉండే బానిసల పట్ల ఉత్తమంగా వ్యవహరించాలని ఈ హదీసు తాకీదు చేస్తోంది. అయితే ఆ ఉత్తమ వ్యవహారం ఎలా ఉండాలి? దానికి ప్రమాణం ఏమిటి? ఈ విషయం కూడా ఇందులో వివరించబడింది. తాము తినే మంచి ఆహారమే తమ బానిసలకూ తినిపించాలి. తాము తొడిగే దుస్తుల్లాంటి దుస్తులే వారికి కూడా ఇవ్వాలి. వారిని తమ పర్యవేక్షణలో ఉన్న సోదరులుగా భావించాలి. మొత్తానికి వారి జీవిత ప్రమాణం కూడా తమ జీవిత ప్రమాణానికి తగ్గట్టుగా ఉండేందుకు సహాయపడాలి. బానిసలు ఇస్లాం స్వీకరించిన వారయితే ధర్మం రీత్యా వారు తమ సోదరులవుతారు. లేదా కనీసం మానవత రీత్యానన్నా వారిని తమ సోదరులుగానే భావించాలి. వారూ మనుషులేననీ, తమకులాగే వారికి కూడా అవసరాలుంటాయనే విషయాన్ని మర్చిపోరాదు. అగత్యపరుల పట్ల ఎల్లప్పుడూ సానుభూతిని ప్రదర్శించాలని ఇస్లాం ధర్మం నొక్కివక్కాణిస్తోంది. దీన్ని ఆధారంగా చేసుకొని మన ఇండ్లల్లో

పనిచేసే నౌకర్లు లేదా మన దగ్గర పనిచేసే కూలీల, ఉద్యోగుల పట్ల కూడా ఉత్తమంగా వ్యవహరించటం, వారి పట్ల సానుభూతిని ప్రదర్శించటం అవసరమని చెప్పవచ్చు. అలాంటి వారి నుండి కూడా వారి శక్తికి మించిన పని తీసుకోకూడదు. వారిని తమ స్వప్రయోజనాల కోసం వాడుకోవటానికి ప్రయత్నించరాదు. వారు బానిసలు కాకపోవచ్చు. కాని వారు మరొకరికి తలొగ్గి పనిచేస్తున్నారంటే దానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. అలాంటివారిపట్ల కరకుగా, అసభ్యకరంగా ప్రవర్తించటం ఎంత మాత్రం సమంజసం కాదు.

ఈ ఉపదేశాల ద్వారా బోధపడేదేమిటంటే ఇస్లాం ధర్మం సర్వమానవ సమానత్వాన్ని కోరుతోంది. మానవుల మధ్య వర్ణ, వర్గ, ఉచ్ఛనీచ, నిమ్నోన్నతా భావాలను రూపుమాపి వారి మధ్య సామాజిక న్యాయ సంస్థాపనకు, సమానత్వ సౌధ నిర్మాణానికి అది ఏనాడో పునాదిరాళ్ళు వేసింది. ఈనాడు మానవుల మధ్య సంబంధాలు మెరుగుపడటంలో ఇస్లాం పోషించిన పాత్ర అద్వితీయమైనది. వర్గ వైషమ్యాలను రూపుమాపటం కోసం ఇస్లాం ధర్మం శాంతియుతమైన, మౌనవిప్లవాన్ని అనుసరించింది. అది కార్మికుల్ని కూడగట్టి, దళితుల పార్టీలు స్థాపించి పెట్టుబడిదారీ వర్గం మీద, సంపన్నుల మీద విజృంభించి అమాయకుల రక్తపాతాన్ని సృష్టించమని చెప్పదు. ఇలాంటి హింసాత్మక విధానాల వల్ల సమాజంలోని వివిధ వర్గాల మధ్య విద్వేషం, వైషమ్యాలు పెచ్చరిల్లుతాయి. రాజ్యంలో శాంతిభద్రతలు క్షీణించి ప్రజలు అశాంతి అలజడుల వాతావరణంలో జీవితం గడపాల్సివస్తుంది. దీనికి భిన్నంగా ఇస్లాం ధర్మం బానిసలు - యజమానుల మధ్య , కూలీలు - కాంట్రాక్టర్ల మధ్య సోదర, సమానత్వ భావాలను పెంపొందింపజేసింది. సమాజంలోని వర్గాలవారందరూ నిమ్నోన్నతాభావాల్ని విడనాడి పరస్పరం ప్రేమాభిమానాలతో, ఆప్యాయతానురాగాలతో జీవితం గడపాలని నొక్కి వక్కాణించింది. అదీగాక ఇస్లాంలో ఒక వ్యక్తి శీలనిర్మాణం కులం ప్రాతిపదిక మీదనో లేక ఆస్తి అంతస్తుల ప్రాతిపదిక మీదనో జరగదు. మీలో ఎవరయితే ఎక్కువగా దైవానికి భయపడతారో వారే అందరికన్నా శ్రేష్ఠులు అని ప్రకటిస్తోంది దివ్యఖుర్ఆన్. అలాంటి దైవభక్తిపరులు ధనికులయినా కావచ్చు నిరుపేదలయినా కావచ్చు.

1362. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: మీలో ఎవరి దగ్గరికయినా అతని సేవకుడు అన్నం (వండి) తెస్తే (అతన్ని కూడా తమ వెంట కూర్చోబెట్టుకొని తినిపించాలి) ఒకవేళ తమవెంట కూర్చోబెట్టుకోవటానికి వీలుకాకపోతే అతనికి ఒకటి

١٣٦٢ - وَعَنْ أَبِي هُرَيرَةَ، رَضِيَ اللهُ عَنهُ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: «إذا أتى أَحدكم خَادِمُهُ بطَعَامِهِ، فَإنْ لم يُجلِسْهُ مَعَهُ، فَليُنَاوِلْهُ لُقمَةً أَوْ لُقمَتَينِ أَوْ أُكلَةً أَو أُكلَتَينِ؛ فَإنَّهُ وَلِيَ عِلاجَه» رواه البخاري.

«الأُكلَةُ» بضم الهمزة: هِيَ اللُّقمَةُ.

రెండు ముద్దలయినా పెట్టాలి. అతను (వంటవార్పు) బాధ భరించి నందుకు గాను అలా చేయటం (ధర్మం).

*(బుఖారీ)*

## ముఖ్యాంశాలు

కేవలం అన్నం విషయంలోనే కాదు, ఇతర తినుబండారాలు, నిత్యావసర వస్తువుల విషయంలోనూ ఇలాగే ఉదారబుద్ధితో వ్యవహరించాలి. ఇంట్లో పనిచేసే నౌకర్లు, పనివాళ్ళతో కలిసి భోంచేస్తే చాలా మంచిది. ఒకవేళ పరిస్థితి దానికి అనుకూలంగా లేకపోతే తమ ఆహారంలోనుంచే వారికి కూడా కొంత పెట్టాలి లేదా వారికోసం మరేదయినా ఏర్పాటు చేయాలి.